నిర్మించారు.. వదిలేశారు

- నిరుపయోగంగా పంచాయతీ భవనం
- వినియోగంలోకి తీసుకురావాలని స్థానికుల డిమాండ్
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



నిరుపయోగంగా ఉన్న పల్లిపాడు పంచాయతీ కార్యాలయం

కొణిజర్ల: రూ.లక్షలతో నిర్మించిన భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. పూర్తి స్థాయిలో భవనం నిర్మించి నిర్లక్ష్యంగా వదిలేయడంతో ప్రభుత్వ ఆస్తులకు రక్షణ లేకుండా పోయింది. మండలంలోని పల్లిపాడులో గతంలో నిర్మించిన పంచాయతీ కార్యాలయం వినియోగంలోకి తీసుకురాక పోవడంతో నిరుపయోగంగా పడింది. పల్లిపాడు పంచాయతీగా ఉన్నప్పుడు 2017లో రూ.13 లక్షలు ఎంజీఎన్ఆర్ ఈజీఎస్ నిధులతో భవనం అప్పటి సర్పంచ్ నిర్మించాడు. భవన నిర్మాణం పూర్తయ్యేనాటికి 2018లో వైరా పట్టణాన్ని మున్సిపాలిటీగా చేసి పల్లిపాడులో వైరా మున్సిపాలిటీలో చేర్చారు.

పట్టించుకోని అధికారులు..

భవనాన్ని నిర్మించిన కాంట్రాక్టర్‌కు ఇప్పటి వరకు పనులకు సంబంధించిన బిల్లులు రాలేదని సమాచారం. దీంతో అతను చివరి దశలో పనులు వదిలేసి వెళ్లిపోయాడు. దీనికి తోడు గ్రామం మున్సిపాలిటీలో విలీనమై ఉండటంతో భవనాన్ని గాలికి వదిలేశారు. అప్పటి అధికారులు కానీ, ప్రస్తుత మున్సిపల్ అధికారులు కానీ దానిని పట్టించుకోవడం లేదు. ప్రజా ప్రతినిధులు సైతం భవనాన్ని ఇతర వినియోగానికి వాడుకోకుండా అదే స్థలంలో పల్లె దవాఖానా నిర్మించారు. ఈ భవనాన్ని ఏదో అవసరానికి వాడుకోవాల్సిన ప్రజా ప్రతినిధులు నిరుపయోగంగా పడేశారు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి భవనాన్ని కనీసం వార్డు అవసరాల కోసమైనా వాడుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి..



అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి భవనాన్ని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురావాలి. రూ.లక్షలు పెట్టి నిర్మించిన భవనం నిరుపయోగంగా పడి ఉంది. నిర్మించిన కాంట్రాక్టర్‌కు బిల్లులు కూడా రాలేదు. దీంతో సదరు కాంట్రాక్టర్ ఇబ్బందులు పడుతున్నాడు. అధికారులు స్పందించాలి.

– రాంపూడి సురేష్, పల్లిపాడు

క్లుప్తంగా

గ్రూప్-4 సాధించిన యువకుడికి సన్మానం



చెన్నూరు సొసైటీ ఆధ్వర్యంలో కృష్ణకాంత్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కల్లూరురూరల్: మండలంలోని చెన్నూరు పంచాయతీ రావికంపాడు గ్రామానికి చెందిన కోలా కృష్ణకాంత్ ఇటీవల నిర్వహించిన గ్రూప్–4 పరీక్షలో ఉత్తీర్ణుడై రాష్ట్ర ప్రభుత్వంలో అకౌంటెంట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. విషయం తెలుసుకున్న చెన్నూరు సొసైటీ అధ్యక్షుడు పాలెపు రామారావు, కోలా కృష్ణకాంత్‌ను సన్మానించారు. నిరుపేద కుటుంబం నుంచి రాష్ట్ర స్థాయిలో పోటీ పరీక్షల్లో పాల్గొని విజయం సాధించి ఉద్యోగం పొందినందుకుగాను కోలా కృష్ణకాంత్‌ను అభినందించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ దేవరపల్లి మొరళి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

కొణిజర్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ, వైరా సబ్ డివిజన్ కార్యదర్శి షేక్ ఖాసీమ్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని గుబ్బగుర్తిలో నిర్వహించిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఆంగోత్ బాషా, కిషన్, దసురు, ఖాసీమ్‌ఖాన్, ఉపేందర్, కృష్ణ, గంగన్న, శంకర్, లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉదయాస్తమాన పూజలు



పూజలు నిర్వహిస్తున్న శీలం చెన్నారెడ్డి, జ్యోతి దంపతులు

మధిర: మధిర పట్టణంలోని లడక బజారులో వేంచేసి ఉన్న శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయంలో మండల పూజల్లో భాగంగా ఆదివారం పూజలు జరిగాయి. ఈ పూజా కార్యక్రమాల్లో ప్రముఖ న్యాయవాది శీలం చెన్నారెడ్డి, జ్యోతి దంపతులు పాల్గొన్నారు. ఆలయం చుట్టూ శివేలి ప్రదక్షిణలు చేశారు. అనంతరం అయ్యప్ప మాలధారులకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు.

వైద్యశిబిరం విజయవంతం



మందులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

బోనకల్: మండల కేంద్రంలో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. శిబిరంలో 100మందికి బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ పవన్‌కుమార్,డి.సాయికుమార్ మాట్లాడుతూ.. బీపీ, షుగర్ పేషంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు తూము రోష్‌కుమార్, యంగల ఆనందరావు, మాజీ వైస్ ఎంపీపీ రమేష్, జిల్లా అధ్యక్షుడు కొండల్‌రావు, మైనార్టీల గ్రామీణ వైద్యుల జిల్లా అధ్యక్షుడు హసన్, గోపి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని శ్రీ సత్యసాయి సేవాసమితిలో ఆదివారం ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తిరుపతయ్య రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, సురేష్, తనూజ, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయండి

కొణిజర్ల: మండలంలోని సింగరాయపాలెంలో ఈ నెల 11న నిర్వహించే సీపీఎం వైరా డివిజన్ మహాసభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. మహాసభ జయప్రదం కోరుతూ ఆదివారం మండలంలోని లక్ష్మీపురం, తీగలబంజర గ్రామాలలో ఆ పార్టీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్, చింతపల్లి ప్రసాద్, కట్టా రాంబాబు, హరిచంద్, సత్యనారాయణ, మహబూబ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ భూతాన్ని తరిమికొడదాం..



మధిర: ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



సత్తుపల్లి: ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ



వైరా: ర్యాలీ తీస్తున్న దృశ్యం

మధిర: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం మధిర పట్టణంలోని ప్రజలకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. దెందుకూరు, మాటూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పృథ్వీరాజ్ నాయక్, వీరబాబు పాల్గొని భవన నిర్మాణ కార్మికులు, ఆటో డ్రైవర్లు, స్థానికులకు కరపత్రాలు అందించి ఎయిడ్స్‌పై అపోహలు తొలగించుకోవాలన్నారు. ఈక్రమంలో స్థానిక తెలంగాణ తల్లి విగ్రహం వద్ద అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కిండిల్ రూరల్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ అనూష, ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

- **వైరా:** ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యాన ఠాగూర్ విద్యాసంస్థలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఠాగూర్ విద్యాసంస్థల కరస్పాండెంట్ సంక్రాంతి రవికుమార్, చైర్మన్ వాసిరెడ్డి సునీత, డైరెక్టర్ సంయోగిత, అధ్యాపకులు పాల్గొన్నారు.
- **సత్తుపల్లి:** సత్తుపల్లిలో గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యాన ఎయిడ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు తాయమ్మ, మంజుల, హెల్త్ అసిస్టెంట్ నాగరాజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.
- **ఎర్రుపాలెం:** మండలకేంద్రంలోని ఎస్వీ అకాడమీ పాఠశాలలో కిండిల్ రూరల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యాన విద్యార్థులకు ఎయిడ్స్ వ్యాధిపై సొసైటీ అధ్యక్షురాలు వి.అనూష అవగాహన కల్పించారు. అనంతరం నిశ్శబ్దాన్ని ఛేదిస్తాం–ఎయిడ్స్‌ను అరికడదాం అంటూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం సతీష్‌కుమార్, డైరెక్టర్లు మిరియాల శ్యామ్‌ప్రసాద్, ఎర్రబోలు నాగేశ్వరరావు, సొసైటీ సభ్యులు కనకవల్లి రమ్య, వీవీ కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.
- **తల్లాడ:** తల్లాడలో పీహెచ్‌సీ ఆధ్వర్యాన అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ వ్యాధిని అరికట్టాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రత్నమనోహర్, సూపర్‌వైజర్లు కమల, భద్రమ్మ, ఝాన్సీలక్ష్మి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మండలస్థాయి వ్యాసరచన పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎంఈఓ దామోదరప్రసాద్

తల్లాడ: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం పునరుత్పాదక ఇందన వనరులు సోర్సెస్ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ప్రథమ బహుమతి తేజావత్ లహరీ లూర్ధుమాతా స్కూల్, ద్వితీయ బహుమతి సుంకర పూజిత, బాలభారతి విద్యాలయం, తృతీయ బహుమతి శ్రీలక్ష్మీబిల్లుపాడు పాఠశాల గెలుపొందారు. విజేతలకు తల్లాడ ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు శివకృష్ణ, రఘు, నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- **ఎర్రుపాలెం:** మండలంలోని ఎమ్మార్సీ కేంద్రంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మురళీమోహన్‌రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిందన్నారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, సూర్యనారాయణ, వెంకటేశ్వరరావు, తదితరులున్నారు.
- **ఏన్కూరు:** స్థానిక గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు నిర్వహించగా.. ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి, ఏటీపీప సునీల్, మండల నాయకులు స్వర్ణ నరేందర్, ధర్మారావు, నాగేశ్వరావు పటాన మజీద్, వర శంకర ప్రసాద్ పాల్గొన్నారు.

సేవ చేయడమే లయన్స్‌క్లబ్ ఉద్దేశం



విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

వైరా: అన్ని వర్గాల వారికి సేవ చేయడమే లయన్స్ క్లబ్ ఉద్దేశ్యమని క్లబ్ ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ డాక్టర్ కాపా మురళీకృష్ణ తెలిపారు. వైరాలోని సాయి మందిరంలో ఆదివారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం వైరా మున్సిపాలిటీ పరిధిలోని బ్రహ్మణపల్లికి చెందిన బీటెక్ విద్యార్థికి ల్యాప్‌టాప్, రెండు కిడ్నీలు దెబ్బతిని ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ ట్రీట్మెంట్ తీసుకుంటున్న పెద్దరాంపురంకు చెందిన ఆటో కార్మికుడికి రూ.12,500 ఆర్థిక సాయం అందించారు. బాధ్యులు వెంకటేశ్వరరావు, శ్యాంబాబు, పూర్ణచంద్రరావు, ఉపేంద్రరావు, ప్రభాకర్, రమేష్ రాంగోపాల్ తదితరులున్నారు.

భగవద్గీత పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



సబ్ జూనియర్ భగవద్గీత పోటీల్లో ప్రథమ బహుమతి అందుకుంటున్న క్రిషిత

తల్లాడ: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన భగవద్గీత పోటీల్లో తల్లాడ బాలభారతి విద్యార్థిని టి.క్రిషిత ప్రథమ బహుమతిని సాధించింది. ఆదివారం ఖమ్మంలో జిల్లా స్థాయిలో భగవద్గీత పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో సబ్ జూనియర్స్‌లో ప్రథమ బహుమతిని క్రిషిత గెలుపొందగా తృతీయ బహుమతిని కె.నవ్యశ్రీ గెలుపొందారు. జూనియర్స్‌లో కె.హేమాన్విత ప్రథమ బహుమతిని, ద్వితీయ బహుమతిని వి.కీర్తన సాధించారు. ఈ సందర్భంగా బహుమతులు సాధించిన విద్యార్థులను కేఎస్ఎం విద్యా సంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, కేఎస్ఎం ప్రిన్సిపాల్ తాళ్లూరి రామారావు, డైరెక్టర్ కోటగిరి శ్రావణి, శ్లోకాల కంఠస్థ ఉపాధ్యాయురాలు డి.సునీత అభినందించారు.

రైతులను నిరాశపరుస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

వైరా: రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి కొండత హామీలు ప్రవేశపెట్టి అమలు గోరంత చేయడం పట్ల రైతులు నిరాశ చెందుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బొంతు రాంబాబు అన్నారు. ఆదివారం వైరాలోని సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన స్టడీ సర్కిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీల భరోసాకు అతీగతి లేదన్నారు. ఎకరాలకు 20 లక్షల పరిహారం లగచర్ల రైతులకు ఇస్తామని సీఎం రైతు పండగ సభలో ప్రకటించడం ఆక్షేపణయం అన్నారు. మాజీ ఎంపీపీ సమత, చలపతిరావు, కృష్ణారావు, సుధాకర్, నాగేశ్వరరావు, చంద్రశేఖర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలి..

వైరా: వైరా వ్యవసాయ మార్కెట్‌లో ఆకాల వర్షాలకు ధాన్యం తడవకుండా కొనుగోలు కేంద్రాల్లో కనీస ఏర్పాట్లు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. ఆదివారం మధ్యాహ్నం కురిసిన ఆకాల వర్షాలకు వ్యవసాయ మార్కెట్‌లో తడిచిన ధాన్యం రాశులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్‌లో వర్షం నీరు బయటకు వెళ్లేందుకు డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. తోట నాగేశ్వరరావు, యనమద్ది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

మధిర: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు తూము(బుంగ)లో ఇరుక్కుపోయిన వ్యక్తిని స్థానికులు రక్షించారు. మధిర మండలం సిరిపురం గ్రామానికి చెందిన మత్స్యకారుడు యంగల రాజు మల్లవరం క్రాస్ రోడ్డులో ఉన్న తూము వద్ద చేపలు పట్టేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు జారిపడి తూములో ఇరుక్కున్నాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు హుటాహుటిన స్పందించి రెండు జేసీబీలను తీసుకొచ్చి అతనిని కాపాడే ప్రయత్నం చేశారు. రెండు గంటల పాటు శ్రమించిన తర్వాత తీవ్ర ఉత్కంఠ మధ్య రాజును క్షేమంగా బయటకు లాగారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ఎర్రుపాలెం: పేకాట స్థావరంపై పోలీసులు దాడిచేసి పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకోగా.. మరో ముగ్గురు పరారీలో ఉన్నారు. ఈ ఘటన మండలకేంద్రంలోని రైల్వే ట్రాక్ పక్కన సుబాబుల్ తోటలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై ... తెలిపిన వివరాల ప్రకారం గత కొద్ది రోజులుగా కొందరు సుబాబులు తోటలో పేకాట ఆడుతుండగా.. స్థానికుల సమాచారం మేరకు దాడి చేసి ముగ్గురిని పట్టుకున్నామని, వారిపై కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

గుండెపోటుతో కళాకారుడు మృతి

మధిర: మధిర పట్టణానికి చెందిన నాట్య కళాకారుడు కలవారి బ్రహ్మం(62) శనివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన గతంలో చిన్నారులకు డ్యాన్స్ మాస్టర్‌గా పనిచేశారు. పలు కార్యక్రమాలకు ఈవెంట్ ఆర్గనైజర్‌గా పనిచేస్తూ జీవనోపాధి సాగిస్తున్నారు. మృతునికి భార్య ఉన్నారు.

ఆయన మృతదేహాన్ని ఆదివారం కలయిక వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఇరుకుళ్ల బాలకోటేశ్వరరావు, మధిర స్విమ్మర్స్ క్లబ్ అధ్యక్షుడు జంగా నరసింహారెడ్డి తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

రైతుల గుండెల్లో 'తుపాన్' గుబులు



తల్లాడలో వరి ధాన్యం తడవకుండా పట్టాలు కప్పి ఉంచిన రైతులు



కొణిజర్లలో తడిసిన వరి పనలు

తల్లాడ/కొణిజర్ల: తుపాన్ ప్రభావంతో ఆదివారం వర్షం జల్లులు పడటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఆకస్మికంగా వర్షం జల్లులు పడటంతో వరి రైతులు ఉరుకులు, పరుగులు పెడుతూ పట్టాలు కప్పారు. తల్లాడ, కొణిజర్ల మండలాల్లో వరి కోతలు ముమ్మరంగా నడుస్తున్నాయి. పలు గ్రామాల్లో రైతులు వడ్లు కోసి తేమ శాతం కోసం కల్లాల్లో ఆరబోసి ఉంచారు. వర్షం కారణంలో వడ్లు తడకుండా రైతులు ధాన్యంపై పట్టాలు కప్పారు. అలాగే పలు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు వరి ధాన్యాన్ని ఆరబెట్టారు. భారీ వర్షం కురిస్తే నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కోయడానికి సిద్ధంగా ఉన్న వరి వానకు తడిచి మొలకెత్తే అవకాశం ఉందని భయాందోళనకు గురౌతున్నారు.

ఘనంగా మున్నూరుకాపు వనసమారాధన



నృత్యం చేస్తున్న చిన్నారులు, మహిళలు



బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పతాకావిష్కరణ

కారేపల్లి: సింగరేణి మండల మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఇల్లందు–ఖమ్మం ప్రధాన రహదారి ఊట్కూరు మామిడితోటలో వనసమారాధన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలంగాణ మున్నూరు కాపు సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పారా నాగేశ్వరరావు మాట్లాడారు. మున్నూరు కాపులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం కాపు కుటుంబాలు ఆటపాటలతో ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల గాంధీ, కనిశెట్టి నర్సయ్య, పగడాల మంజుల, నర్సింగ్ శ్రీనివాసరావు, అడప పుల్లారావు, హన్మకొండ రమేష్, వై ప్రకాశ్, తేళ్ల శ్రీనివాసరావు, గమిడి నరసింహారావు, ముత్యాల సురేష్, నూకల శ్రీధర్, పగడాల నాగేశ్వరరావు, వాకాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని మార్కెట్ కమిటీ ప్రాంగణంలో తెలంగాణ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య సత్తుపల్లి శాఖ ఆధ్వర్యాన ఆదివారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా విశేష పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సామూహిక వనభోజనాలు నిర్వహించారు. అప్పారావు, కృష్ణమోహన్, ఎంఎస్ఆర్.శర్మ, వినోదరావు, వేణుగోపాల్, మల్లికార్జునరావు, పుల్లారావు, పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆర్టీసీలో..

సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో ఆదివారం ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులతో వనభోజనాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించి డిపో మేనేజర్ రాజ్యలక్ష్మీ బహుమతులు అందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పీ.విజయశ్రీ, ఎంఎఫ్ సాహితీ, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



మాట్లాడుతున్న పారుపల్లి నాగేశ్వరరావు

మధిర: ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతిబంధకంగా మారిన నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు కోరారు. స్థానిక టీవీఎం పాఠశాలలో ఆదివారం మధిర మండల శాఖ అధ్యక్షుడు వినోదరావు అధ్యక్షతన యూనియన్ మండల 11వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ఈ కుబేర్‌లో పెండింగ్‌లో ఉంచిన బిల్లులన్నింటినీ క్లియర్ చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ముందుగా పలు నివేదికలను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈనెల 14, 15 తేదీల్లో సత్తుపల్లిలో జరిగే జిల్లా 6వ విద్యా మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టీఎస్ యూటీఎఫ్ మధిర మండల కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా బండారు నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఈ వీరయ్య, ఉపాధ్యక్షులుగా ఎస్‌కె ఇబ్రహీం, కాజా సునీత, కోశాధికారిగా చెన్నయ్యతో పాటు నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా యూటీఎఫ్ ఎర్రుపాలెం మండల ప్రధాన కార్యదర్శి అనుమోలు కోటేశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాంబాబు, నాగూర్ వలి, రంజాన్, ఉద్దండు షరీఫ్, వీరయ్య, ఆంజనేయులు, లక్ష్మణ్ రావు, మీరాఖాన్, ఇబ్రహీం, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థి సంఘం కార్యవర్గం ఎన్నిక



వాగ్దేవి పూర్వ విద్యార్థి సంఘ నూతన కార్యవర్గం

సత్తుపల్లిటౌన్: గంగారం దాసరి వీరారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వాగ్దేవి పూర్వ విద్యార్థి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా ఏ.శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా డి.శ్రీనివాస రెడ్డి, సహాయ కార్యదర్శిగా కొనకళ్ల శంకరరావు, కోశాధికారి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో శ్రీదేవి, కరుణాకర్, మాధవరెడ్డి, వాసుదేవరావు, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు

కారేపల్లి: ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షుడిగా బచ్చల వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం రాష్ట్ర నాయకత్వం భద్రాద్రికొత్తగూడెం జిల్లా కేంద్రంలో నిర్వహించిన మహాసభలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సదర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నిక చేసిన రాష్ట్ర నాయకత్వానికి, సింగరేణి మండల నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీతో అనుబంధ సంఘాల నాయకులు

ముదిగొండ: ముదిగొండ మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బొడ్డు అనీల్‌మాదిగ, అధికార ప్రతినిధిగా ఇరుకు రమేష్‌మాదిగ, ఎమ్మెస్పీ అధ్యక్షుడిగా పడిశాల నాగేశ్వరరావు మాదిగ, అధికార ప్రతినిధిగా కట్టకూరు రమేష్‌మాదిగ, మాదిగ యువసేన మండల అధ్యక్షుడిగా నారపొంగు జాని, అధికార ప్రతినిధిగా నారపొంగు వాసుమాదిగలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతక కమిటీల ఎన్నికలను ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షులు కూరపాటి అనీల్‌మాదిగ, తూరుగంటి అంజయ్య, మాదిగలు హాజరయ్యారు. సమావేశంలో నాయకులు నాగేశ్వరరావు, భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాలల సింహగర్జనకు తరలిన కార్యకర్తలు



కల్లూరు నుంచి తరలి వెళ్తున్న శ్రేణులు



ముదిగొండలో..

కల్లూరురూరల్/ముదిగొండ: ఎమ్మార్పీఎస్ వర్గీకరణలో తమకు సమాన వాటా రావాలని. వర్గీకరణలో తమకు అన్యాయం జరుగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ.. మాలమహానాడు ఇచ్చిన పిలుపు మేరకు హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన సింహగర్జనకు కల్లూరు, ముదిగొండ మండలంలో నుంచి వివిధ గ్రామాలకు చెందిన మాల సోదరులు తరలి వెళ్లారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు ఉండేటి శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘం నాయకులు తోటమల్ల సీతారాములు, నాగేశ్వరరావు, జైపాల్, నాగరాజు, కొమ్ము నరసింహారావు, ఉదయ్‌రాజ్ పాల్గొన్నారు.